క్లుప్తంగా

యేసురత్నం సేవలు అభినందనీయం



అన్నదానం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

సూర్యాపేటటౌన్ : క్రైస్తవ సమాజానికి వంగాల యేసురత్నం అందించిన సేవలు అభినందనీయమని వీవైఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు వంగాల రత్నప్రసాద్ అన్నారు. యేసురత్నం 70వ జయంతి సందర్భంగా వీవైఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్డు అంబేద్కర్ విగ్రహం వద్ద, కొత్త బస్టాండ్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సుమారు 500 మందికి అన్నదానం చేసి మాట్లాడారు. వంగాల యేసురత్నం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని గుర్తుచేశారు. ఆయన అడుగుజాడల్లోనే సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. యేసురత్నం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వంగాల లాజరస్, సంద్రపాటి లాజరస్, నన్నెపంగ జయరాజ్, జిల్లెపల్లి కిరణ్, బొజ్జ ప్రశాంత్, వీవైఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామి ఆలయంలో పూజలు



రమేష్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

తుంగతుర్తి : కరివిరాలలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం కాంగ్రెస్ జిల్లా నాయకుడు దొనకొండ రమేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో సీతారామచంద్రస్వామి ఆలయ చైర్మన్ జనార్దన్, వెంకన్న, నరేష్, కాంతయ్య చారి పాల్గొన్నారు.

కంఠమహేశ్వర స్వామి కల్యాణోత్సవం



జలబిందెలతో తరలివెళ్తున్న గౌడ కులస్తులు

నూతనకల్ : మండల కేంద్రంలో శ్రీ సురమాంబ కంఠమహేశ్వర స్వామి పంచమ కల్యాణ మహోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన గౌడ కులస్తులు జలబిందెలతో తరలివెళ్లి దేవతామూర్తులకు జలాభిషేకం గావించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

అర్వపల్లి : ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అర్వపల్లిలో క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కోలా కరుణాకర్‌ముదిరాజ్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల రమేష్‌ముదిరాజ్ మాట్లాడారు. ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండి తమ సమస్యల సాధనకు పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కనుకు పద్మశ్రీనివాస్, కొమారి మహేష్, కుంభం సతీష్, కొమారి వీరయ్య, పండు, కిరణ్, రాములు, గోపి, విక్రం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

ఆత్మకూర్(ఎస్) : ఆత్మకూరు మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో యూరియా స్టాక్‌ను శుక్రవారం మండల వ్యవసాయ అధికారి డి.దివ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నెమ్మికల్ పీఏసీఎస్‌లో 20 మెట్రిక్ టన్నులు, ఏపూర్ పీఏసీఎస్‌లో 20 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉందని తెలిపారు.

పాలకవర్గానికి సన్మానం



నూతన పాలకవర్గాన్ని సన్మానిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఏర్పాటైన నూతన పాలకవర్గాన్ని జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి, కొమ్మాలకు చెందిన ధర్మకర్త బచ్చలి ప్రవీణ్‌ను సన్మానించి, వారిని నియమించిన ఎమ్మెల్యే సామేల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

12నుంచి లక్ష్మీతిరుపతమ్మ జాతర

- చీదెళ్లలో ముస్తాబవుతున్న ఆలయం
- 17వరకు వేడుకలు

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండలంలోని చీదెళ్ల గ్రామంలో ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు శ్రీలక్ష్మీతిరుపతమ్మ గోపయ్య స్వాముల జాతర నిర్వహించనున్నారు. కృష్ణా జిల్లా పెనుగంచిప్రోలు జాతరను తలపించే విధంగా జరిగే ఈ వేడుకను మాఘశుద్ధ పౌర్ణమి రోజున జరుపుకుంటారు. ఈ జాతరకు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచే గాక కృష్ణా, వరంగల్, ఖమ్మం, గుంటూర్, హైదరాబాద్ జిల్లాల నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. ఈ జాతరలో ప్రభ బండ్ల ఊరేగింపు ఎంతో విశిష్టత చోటు చేసుకుంటుంది. ఇక్కడికి వచ్చిన భక్తులకు సంతానం లేని వారికి సంతానం కలుగుతుందనే నమ్మకం ఉంది. వేడుకలు సమీపిస్తున్నందున ఇప్పటికే దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలకరించారు.

12నుంచి కార్యక్రమాలు..

ఈ నెల 12న చీదెళ్లలో దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, 13న కోలాటాలతో ప్రభబండ్ల ఊరేగింపు ఉంటుంది. 14న తెలుగు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభిస్తారు. అదే రోజున తంగెళ్లగూడెంలో అమ్మవార్ల ఊరేగింపు ఉంటుంది. అలాగే రాత్రి డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం నిర్వహించనున్నారు. 15న చెట్లముకుందాపురంలో అమ్మవారి ఊరేగింపు, మిడిశనమెట్ల శివరాం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఉంటుంది. 16న రామన్నగూడెంలో అమ్మవారి ఊరేగింపు, కబడ్డీ పోటీల ఫైనల్స్, చిన సీతారాంతండాలో అమ్మవారి ఊరేగింపు, రాత్రి డ్యాన్స్ బేబీ డ్యాన్స్, జబర్దస్త్ కార్యక్రమాలు ఉంటాయి. 17న శ్రీ లక్ష్మీతిరుపతమ్మ గోపయ్య స్వాముల కల్యాణ మహోత్సవం (చంద్రపట్నం) నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోదుగు నర్సిరెడ్డి, మాజీ సర్పంచ్ పరెడ్డి సీతారాంరెడ్డి తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.



శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యస్వాముల ఆలయం

ఏర్పాట్లు చేస్తున్నాం



శ్రీలక్ష్మీ తిరుపతమ్మగోపయ్య స్వాముల జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మాజీ సర్పంచ్ పరెడ్డి సీతారాంరెడ్డి సహకారంతో ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులను ఉత్తేజపరిచేందుకు డ్యాన్స్ బేబీ డ్యాన్స్, జబర్దస్త్ ప్రోగ్రాంలు కూడా ఉండనున్నాయి.

– మోదుగు నర్సిరెడ్డి, దేవాలయ కమిటీ చైర్మన్

న్యాయబద్ధంగా ఎస్సీ వర్గీకరణ

- ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి : కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను న్యాయబద్ధంగా చేపట్టిందని తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ అన్నారు. శుక్రవారం తిరుమలగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం 2004లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపారని గుర్తుచేశారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడూ మాదిగల పక్షాన నిలబడలేదని ఆయన విమర్శించారు. సుప్రీం కోర్టు తీర్పు అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం 4 నెలల్లోనే ఎస్సీ వర్గీకరణ చేపట్టిందని తెలిపారు. ఏబీసీడీ వర్గీకరణ న్యాయబద్ధంగా, శాస్త్రీయంగా సాగిందని పేర్కొన్నారు. అసెంబ్లీలో బిల్లు ప్రవేశ పెట్టిన ఫిబ్రవరి 4ను సామాజిక న్యాయ దినంగా పాటిస్తామని తెలిపారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు న్యాయం చేసే విధంగా పనిస్తోందని అన్నారు. బీసీల జనాభా ఎంత ఉంటే వారికి అంత వాటా చెందాలనే లక్ష్యంతో 50 రోజులపాటు కుల గణన చేయించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో బీసీలు 56 శాతం ఉన్నారని తెలిపారు. బీసీల జనాభా ప్రకారం ప్రభుత్వం బడ్జెట్ కేటాయిస్తోందన్నారు. అలాగే బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ 42 శాతం టిక్కెట్లు కేటాయిస్తుందని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ మాదిగల వ్యతిరేక పార్టీ అని, బీసీలను అవమానపరిచిన పార్టీ అని విమర్శించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఎల్సోజు నరేష్, పరమేష్, గుడిపాటి సైదులు, కందుకూరి లక్ష్మయ్య, పేరాల వీరేష్, జమ్మిలాల్, శాగంటి రాములు, బుచ్చిబాబు, నర్సింహారెడ్డి, సుంకరి జనార్దన్, బత్తుల శ్రీను, రాముగౌడ్, వీరమల్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేల్

కులగణనపై విమర్శలు సరికాదు

- పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రమేష్‌రెడ్డి

భానుపురి : అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు సమానంగా అందాలని, దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా పారదర్శకంగా కులగణన కార్యక్రమం నిర్వహిస్తే ప్రతిపక్షాలు అర్థంలేని విమర్శలు చేస్తున్నాయని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేటలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న కేసీఆర్ ఏడు లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రాన్ని కోలుకోలేని విధంగా నాశనం చేశాడని అన్నారు. కేసీఆర్ అసమర్థ పాలనతో రాష్ట్రం అన్నిరంగాల్లో దెబ్బతిన్నదని తెలిపారు. అయినా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెనకడుగు వేయడం లేదని అన్నారు. మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి ప్రభుత్వంపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు షఫీఉల్లా, వెలుగు వెంకన్న, ముదిరెడ్డి రమణారెడ్డి, చిలుముల గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పటేల్ రమేష్‌రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నాగారం : ఎస్సీ వర్గీకరణ అమలుకు కేబినెట్‌లో తీర్మానం చేయడంతోపాటు, బీసీల కులగణన 42 శాతం నిర్ధారించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ నాగారం మండల పరిధిలోని పసునూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్ చిత్రపటాలకు శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ బిల్లును దేశంలో మొట్టమొదటిసారిగా ప్రవేశపెట్టిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు నరాల వీరయ్య, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు పంది శ్రీనివాస్, గ్రామశాఖ అధ్యక్షులు చిత్తలూరి వెంకటయ్య, మల్లేపాక శ్రీను, పత్తేపురం రాఖీ, నరాల అబ్బయ్య, పాదిల నరేష్, నరాల బిచ్చిరాములు, పత్తెపురం సైదులు, పాదిల వెంకన్న, మల్లెపాక దుర్గయ్య, వీరయ్య, ఎల్లయ్య, చంద్రయ్య, శ్రీను, సత్తయ్య, నరహరి, శ్రీరాములు, లింగయ్య, గోపి, గణేష్, భిక్షం, నర్సయ్య, హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

పెన్‌పహాడ్ : వైద్యసిబ్బంది ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్యాన్సర్ నివారణకు ఆరోగ్య సిబ్బంది పూర్తిస్థాయిలో కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి స్రవంతి, ఎస్‌ఓ సాంబశివరావు, ఎంఎల్ వీరయ్య, హెచ్‌ఈఓలు శ్రీనివాసులు, చంద్రశేఖర్‌రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

రాజకీయాలకు అతీతంగా పోరాడుదాం

నూతనకల్ : మండల సమగ్రాభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా పోరాడుదామని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో సమగ్రాభివృద్ధి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా మండలం అభివృద్ధికి నోచుకోలేదని ఆయన విమర్శించారు. అభివృద్ధి పనుల కోసం అన్ని రాజకీయ పార్టీలు మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేసోజు మధు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు సుంకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దగ్గుల మల్లయ్య, గడ్డం శ్రీను, బొలగాని ఉప్పలయ్య, మణికుమార్, పులుసు క్రాంతి, ముప్పాని మధు, నరేష్, కూసు పరమేష్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

విద్యార్థుల విజ్ఞాన విహారయాత్ర



విహారయాత్రలో పాల్గొన్న విద్యార్థులు

అర్వపల్లి : అర్వపల్లిలోని మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు శుక్రవారం విజ్ఞాన విహారయాత్రకు వెళ్లారు. హైదరాబాద్‌లోని వివిధ చారిత్రాత్మక ప్రదేశాలను సందర్శించారు. ఆయా ప్రాంతాల ప్రత్యేకతను ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ విపిన్‌కుమార్ మాట్లాడారు. విహారయాత్రలతో విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ గిరిజ, హెచ్‌ఎం అమర్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రమ, దేవేంద్ర, రజిత, నిఖిత, నిర్మల, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్గీకరణ బిల్లు ఆమోదాన్ని స్వాగతిస్తున్నాం

కోదాడరూరల్ : ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించడాన్ని స్వాగతిస్తున్నామని టీఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చింత బాబుమాదిగ అన్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు మాదిగల చిరకాల కోరిక అయిన ఎస్సీ వర్గీకరణను రాష్ట్రంలో అమలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహతో పాటు ఉద్యమ నాయకులు మంద కృష్ణ మాదిగకు కృతజ్ఞతలు తెలిపారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన పంబాల, మన్నే కులాలను కేటగిరి ఏ నుంచి తొలగించి సీలో చేర్చాలని అన్నారు. బుడగ జంగాలు, డెక్కలి కులాలను ఏ కేటగిరిలోకి తేవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు బాణాల అబ్రహం, కందుకూరి నాగేశ్వరరావు, బొల్లెపోగు స్వామి, నారకట్ల ప్రసాద్, కాశయ్య, బాబురావు, శ్రీను, చిన్ని, చంటి ఉన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘించొద్దు

చిలుకూరు : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున నిబంధనలు పాటిస్తూ కనకదుర్గమ్మ జాతరను జరుపుకోవాలని ఎస్‌ఐ సురభి రాంబాబుగౌడ్ సూచించారు. జెర్రిపోతులగూడెం గ్రామంలో ఈనెల 13, 14, 15 తేదీల్లో నిర్వహించే కనకదుర్గమ్మ జాతర సందర్భంగా శుక్రవారం నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతరలో డీజేలు, డ్యాన్స్ ప్రోగ్రామ్‌లు పెట్టొద్దని, రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దన్నారు. బేతవోలులో జరిగే జాతరలో కూడా ఇవే నిబంధనలు పాటించాలన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

అర్వపల్లి : అర్వపల్లిలో శుక్రవారం రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. అయితే 108 సిబ్బంది సకాలంలో స్పందించి మెరుగైన వైద్యం అందించి ఆ వ్యక్తి ప్రాణాలు కాపాడారు. నల్లగొండకు చెందిన కృష్ణ అనే వ్యక్తి ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. విధుల్లో భాగంగా బైక్‌పై అర్వపల్లికి వస్తుండగా పోలీస్ స్టేషన్ సమీపాన ఎదురుగా వచ్చిన ఎద్దును తప్పించబోయి కిందపడి తలకు గాయాలై తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే 108 సిబ్బంది ప్రదీప్, సంతోష్‌లు సకాలంలో అంబులెన్స్‌లోనే మెరుగైన వైద్యం అందించి సూర్యాపేటలోని జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. అయితే కృష్ణ ప్రాణాలు కాపాడటానికి కృషి చేసిన 108 సిబ్బందిని జిల్లా జనరల్ ఆస్పత్రి డాక్టర్ మౌనిక అభినందించారు. 108 అంబులెన్స్ జిల్లా అధికారులు కూడా అభినందనలు తెలియజేశారు.

స్కిల్ ఎక్స్‌పోలో ప్రతిభ



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

చివ్వెంల : చివ్వెంల మండలం దురాజ్‌పల్లి శివారులోని ఎంఎస్‌ఆర్ సెంట్రల్ స్కూల్‌కు చెందిన విద్యార్థి కొల్లు మహిదర్ సీబీఎస్‌ఈ స్కిల్ ఎక్స్‌పో–25లో ప్రతిభ కనబరిచారు. స్మార్ట్ బస్సు తయారు చేసి స్కిల్ ఎక్స్‌పో సమ్మేళనంలో ప్రదర్శించాడు. దీంతో ఆ విద్యార్థికి సీబీఎస్‌ఈ స్కిల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ విశ్వజిత్ సాహ చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతి అందజేశారు. విద్యార్థిని పాఠశాల చైర్మన్ కె.మధుసూదన్‌రావు, డైరెక్టర్ శ్రీనివాస్ రావు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలి



ఆలయంలో ధ్వజ స్తంభం వద్ద పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్

తుంగతుర్తి : ప్రతి ఒక్కరూ దైవ భక్తిని కలిగి ఉండాలని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. కర్విరాల గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయం ధ్వజ స్తంభారోహణ కార్యక్రమానికి ఆయన శుక్రవారం ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఆలయాల నిర్మాణం ప్రజల్లో ఐక్యతకు నిదర్శనమన్నారు. భక్తి భావం అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత కలుగుతుందని తెలిపారు. అనంతరం ఆలయంలో సీతారాములకు, నంది, శివలింగం, ధ్వజ స్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు కిషోర్‌కుమార్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూజారి అనంతరామ శాస్త్రి, బీఆర్ఎస్ నాయకులు తాటికొండ సీతయ్య, గుండగాని రాములు, మట్టపల్లి శ్రీశైలం, నాగమల్లు, శ్రీను, భక్తులు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ

నూతనకల్ : దళిత బహుజన నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో తన సొంత ఖర్చులతో సుమారు రూ. 2.50లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన పాపన్న విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గోల్కొండ నవాబులకు వ్యతిరేకంగా దళిత బహుజనులను ఏకం చేసిన చేపట్టిన మొదటి వ్యక్తి పాపన్న అని తెలిపారు. ప్రతి ఒక్కరూ పాపన్న వారసత్వాన్ని ముందుకు తీసుకుపోవడంతోపాటు అతని పోరాట చరిత్రను భావితరాలకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తీగల కరుణశ్రీ, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్, గౌడ సంఘం నాయకులు బండపల్లి శ్రీను, మొగుళ్ల శ్రీరాములు, మారగాని వెంకటచలం, బూడిద మల్లయ్య, మద్దెల సురేందర్, బండపల్లి బుచ్చిరాములు, బండపల్లి సాయిలు, లింగయ్య, కనకటి యాదగిరి, మారగాని వెంకన్న, యాదగిరి, మొగుళ్ల వెంకన్న, బండపల్లి సాగర్, బత్తిని లక్ష్మయ్య, బూడిద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నూతనకల్‌లో పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, తదితరులు

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

నూతనకల్ : తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డిని మండల కేంద్రానికి చెందిన యాదవ సంఘం నాయకులు శుక్రవారం సన్మానించారు. సన్మానించిన వారిలో యాదవ సంఘం అధ్యక్షుడు ఉప్పుల వెంకన్న, జటంగి గణేష్, కలంచర్ల లింగయ్య, ముత్యాలు, సోమయ్య, గుండాల దేవలింగం, సతీష్, వీరస్వామి, యాకయ్య ఉన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన

నూతనకల్ : సైబర్ నేరాల నియంత్రణ, మత్తు పదార్థాల నివారణపై పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలని హెడ్ కానిస్టేబుల్ వెంకన్న అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తాళ్లసింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాల నియంత్రణ, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై కళాబృందం సభ్యులు ఆటపాటల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మాదగోని సత్యనారాయణగౌడ్, శ్రీనివాసరావు, వెంకటచారి, మనోజ్, ఎల్లయ్య, గోపయ్య, గురులింగం, కృష్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హెడ్‌కానిస్టేబుల్ వెంకన్న

ఆలయ ముఖద్వారం నిర్మాణానికి తోడ్పాటు

పెన్‌పహాడ్ : అనంతారంలోని శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయ ముఖ ద్వారం నిర్మాణానికి శనివారం భూమి పూజ నిర్వహించారు. గ్రామానికి చెందిన బైరెడ్డి మట్టారెడ్డి జ్ఞాపకార్థం అతడి కుమారులు బైరెడ్డి సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డిలు సుమారు రూ. 3.50లక్షల వ్యయంతో ముఖద్వార నిర్మాణం చేపడుతున్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న దాతలను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎరెడ్ల శ్రీనివాస్‌రెడ్డి, బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గజ్జెల కృష్ణారెడ్డి, మల్గిరెడ్డి బక్కారెడ్డి, మామిడి అంజయ్య, దంతాల వెంకన్న, మామిడి పరందాములు, బైరెడ్డి నాగార్జున్‌రెడ్డి, సాయిరి లక్ష్మయ్య, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆలయ ముఖద్వారం నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న బైరెడ్డి సంజీవరెడ్డి, తదితరులు

ఘనంగా స్వపరిపాలన వేడుకలు



తుంగతుర్తిలోని శ్రీవిద్యాభారతి పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

తుంగతుర్తి : మండల కేంద్రంలోని శ్రీ విద్యాభారతి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా వ్యవహరించి పలువురిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ బోయిని లింగయ్య మాట్లాడారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.మల్లయ్య, డైరెక్టర్స్ ఎండీ నజీరోద్దీన్, కోట వెంకటగోపాల్, ఉపాధ్యాయులు లింగమూర్తి, సరిత, సురేష్, ఈరోజీ, అనిత, ఉమా, సునీత, రాధ, మున్ని, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

కోదాడరూరల్ : బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. కోదాడ మండలం పరిధిలోని తొగర్రాయిలో వెన్నెముక సర్జరీ చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు అమరబోయిన శ్రీనివాస్‌యాదవ్‌ను శుక్రవారం ఆయన పరామర్శించి మాట్లాడారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ చింత కవితారాధారెడ్డి, నాయకులు దొంగల లక్ష్మీనారాయణ, ముత్తవరపు రమేష్, పాట్టా కిరణ్, శెట్టి సురేష్, ఉద్దండు, ఇమ్రాన్‌ఖాన్, ఉపేందర్, కిరణ్‌చౌదరి, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి నివాళి

అర్వపల్లి : అర్వపల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సాయిని అంజయ్య ఇటీవల మృతి చెందారు. దీంతో శుక్రవారం మృతుడి కుటుంబాన్ని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ పరామర్శించి రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల రమేష్, బైరబోయిన మహరాజు, సైదులు, కనుకు శ్రీనివాస్, బొడ్డు వెంకట్, కుంభం సతీష్, కోటిప్రసాద్, మహేష్, యాగానందం, మనోహర్, మాధవ్, పండు, గుడిసె కిరణ్ పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారం

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో రేఖ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంచినీటి సమస్యను పరిష్కరించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు బోయలపల్లి రేఖ ఆలయ ఆవరణలో బోరు వేయించారు. మోటార్ ఏర్పాటు చేయించి, పైప్‌లైన్ నిర్మాణం చేపట్టి మినీ ట్యాంక్‌ను నిర్మించారు. సుమారు రూ.2లక్షలకు పైగానే వెచ్చించి ఆలయంలో నీటి సమస్యను పరిష్కరించారు. ఆలయంలో భక్తుల సౌకర్యార్థం స్వచ్ఛమైన నీటిని అందించుటకు ఆర్‌ఓ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు బోయలపల్లి రేఖ, డైరెక్టర్ మద్ది పద్మ తెలిపారు.

ప్రతిభను వెలికితీసేందుకు టాలెంట్ టెస్టులు

కోదాడ : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి టాలెంట్ టెస్టులు దోహదపడతాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల శ్రీనివాసరావు అన్నారు. గత నెలలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్ విజేతలకు శనివారం కోదాడలోని రేస్ కళాశాలలో బహుమతులు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో రేస్ కళాశాల చైర్మన్ బాణాల వసంత, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ సంఘాల నాయకులు చేపూరి కొండలు, తమ్మనబోయిన నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విజయగణపతి ఆలయ వార్షికోత్సవం

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని విజయగణపతి దేవాలయ 20వ వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృతాభిషేకం జరిపి పూలతో అలంకరించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి కృష్ణయ్య, చలపాటి శివ, ఓరుగంటి బ్రహ్మం, చలపాటి రామారావు, వంగవీటి లక్ష్మణ్‌రావు, గోపారపు ఉపేందర్, మేకల నరేష్ తదితరులు ఉన్నారు.